క్లుప్తంగా

చలో కలెక్టరేట్ విజయవంతం చేయండి

సిరిసిల్లఅర్బన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ సోమవారం చేపట్టనున్న చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఖానాపురం లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ వీహెచ్‌పీఎస్, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనాలన్నారు. అక్టోబర్ 17న జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో నిరసన ర్యాలీలు, 22న చలో హైదరాబాద్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



బోయినపల్లి: జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వారాల నర్సింగం ఆధ్వర్యంలో మల్లాపూర్, మాన్వాడ, కొత్తపేట, రేగులపల్లి గ్రామాల ప్రజలు ఆదివారం మల్లాపూర్‌లో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే సత్యం నాలుగు గ్రామాలకు సీసీ రోడ్లు, మురుగు కాలువలు, యాదవ సంఘ భవనం, ఇందిరమ్మ ఇళ్లు తదితర అభివృద్ధి పనులు చేశారన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ వేసిరెడ్డి దుర్గారెడ్డి, మాజీ సర్పంచులు రామిడి శ్రీనివాస్, వేసిరెడ్డి నరసింహారెడ్డి, మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, మాధవరెడ్డి, రమేశ్, శివరాం, రాజేందర్, అంజన్ కుమార్ మహేశ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత



ప్రశాంత్‌కు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎగుర్ల ప్రశాంత్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆదివారం నియామకమయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడు దండు వినోద్ తంగళ్లపల్లిలో ప్రశాంత్‌కు నియామకపత్రం అందజేశారు. ప్రశాంత్ మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



చందుర్తి: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాంను నిర్వహిస్తున్నామని ఎస్సై జిల్లెల్ల రమేశ్ అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని తిమ్మాపూర్‌లో కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రజల రక్షణే పోలీసుల బాధ్యతన్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసాలకు గురైతే 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామస్తులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించండి

తంగళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించాలని మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పదేళ్లుగా ప్రజల పక్షాన పోరాటాలు చేశానని ఎన్నో కేసులు, అక్రమ అరెస్టులు ఎదుర్కొన్నానని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడిగా తనకు అండగా నిలవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను అభ్యర్థించారు.

సన్మానం



అఖిల్ యాదవ్‌ను సన్మానిస్తున్న కామారెడ్డి ఎస్పీ రాజేశ్ చంద్ర

తంగళ్లపల్లి: మండలంలోని దేశాయిపల్లె గ్రామానికి చెందిన యువకుడు మేకల అఖిల్ యాదవ్‌ను కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర ఆదివారం సన్మానించారు. కామారెడ్డి పోలీసులు ఇటీవల అంతర్జాతీయ దొంగనోట్ల ముఠాను పట్టుకున్నారు. దొంగ నోట్ల ముఠాను పట్టుకునేందుకు పోలీసులకు కీలక సమాచారం అందించిన అఖిల్ యాదవ్‌ను సన్మానించినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

- అధికారుల కళ్లు గప్పి అక్రమంగా తరలింపు
- విపరీతమైన వేగంతో ప్రజలకు ఇబ్బంది



ఇసుక ట్రాక్టర్లను తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

బోయినపల్లి: మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, ఇతర నిర్మాణ అవసరాలకు మండలంలోని మాన్వాడ మానేరువాగు నుంచి అనుమతులు ఇస్తున్నా పలువురు రవాణాదారులు కాసుల కక్కుర్తి పడి అక్రమంగా తరలిస్తున్నారు. ఈనెల 10న మాన్వాడ ఇసుక రీచ్ నుంచి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణాకు ప్రయత్నించిన ఐదు ఇసుక ట్రాక్టర్లను ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. గతంలో ఆర్ఐ మనోజ్ సైతం ఇసుక అక్రమంగా తరలించే ట్రాక్టర్లను పట్టుకున్నారు. అధికారులు తనిఖీలు చేస్తున్నా వారి కళ్లుగప్పి అక్రమరవాణాకు పాల్పడుతున్నారు.

అధికారుల కళ్లుగప్పి అక్రమాలు

మాన్వాడ మిడ్‌మానేరు ప్రాజెక్టు డౌన్ స్ట్రీమ్ నుంచి రెవెన్యూ అధికారుల అనుమతులతో ఇసుకను తరలిస్తున్నారు. పలు గ్రామాల్లో డీడీలు ఒకరి పేరున ఉంటే ఇసుక మరొకరికి పోసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కోరెంలో గతంలో ఇసుక రవాణాలో అవకతవకలు జరగడంతో తహసీల్దార్ చాలారోజుల వరకు డీడీలు ఇవ్వలేదు.

విపరీతమైన వేగం..

ఇసుక ట్రాక్టర్లు విపరీతమైన వేగంతో వెళ్తుండడంతో రోడ్లు ధ్వంసం కావడంతోపాటు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవు. నిత్యం పెట్రోలింగ్ చేస్తున్నాం. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందితే కఠినంగా వ్యవహరిస్తాం. వాహనపత్రాలు లేకుంటే చర్యలు తీసుకుంటాం.

– రమాకాంత్, ఎస్సై, బోయినపల్లి

బీసీలపై బీజేపీకి సవతి ప్రేమ

- సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్లటౌన్: బీసీలపై బీజేపీ ప్రభుత్వం సవతి ప్రేమ కనబరుస్తోందని సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఆదివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రాజ్యాంగం 73, 74 సవరణ ప్రకారం ప్రతీ ఐదేళ్లకు స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు జరపడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం కోసం బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్‌లకు పంపితే పెండింగ్‌లో పెట్టారన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ తేల్చకుండా పెండింగ్‌లో పెట్టడం చూస్తే బీసీలపై ఉన్న ప్రేమ అర్థమవుతుందన్నారు. బీఆర్ఎస్ కూడా స్పష్టమైన వైఖరి తెలపాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పార్టీ ఉన్న అన్ని చోట్ల వార్డుమెంబర్లుగా, ఎంపీటీసీలుగా, జెడ్పీటీసీలుగా, సర్పంచ్‌లుగా పోటీ చేస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్ జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 2000–01లో అదే పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమావేశమై అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, సత్తయ్య, రాజిరెడ్డి, కృష్ణమూర్తి, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

కోనరావుపేట: కోనరావుపేట ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఆదివారం మండలంలోని నిజామాబాద్ ఎల్లమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రికెట్ టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.20 వేలు, రన్నరప్ జట్టుకు రూ.10వేల నగదు బహుమతులు సింగం ప్రసాద్ అందజేశారు. వివిధ గ్రామాల యువకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు



ముస్తాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

ముస్తాబాద్: రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్, మొర్రాయిపల్లెలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, డైరెక్టర్లు ప్రతాప్‌రెడ్డి, దేవేందర్, భాగ్య, కొంరయ్య, నాయకులు అరుట్ల రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, అంజనేయులు, ప్రశాంత్, నర్సింలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కోనరావుపేట: రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని కోనరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సీసీఐ, ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకు విక్రయించాలన్నారు.

మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు



తంగళ్లపల్లి: మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై ఉపేంద్రచారి అన్నారు. ఆదివారం రాత్రి మండలకేంద్రంలోని ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యంతాగి వాహనాలు నడపవద్దన్నారు. వాహనదారులు సరైన పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.10లక్షలు అందించాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్లటౌన్: విధి నిర్వహణలో మృతిచెందిన గంభీరావుపేట గ్రామపంచాయతీ కార్మికుడు రమేశ్ కుటుంబానికి రూ. 10 లక్షలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం అంబేడ్కర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ ధర్నా చేపట్టి మాట్లాడారు. కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికులకు భద్రత, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్షులు మల్యాల నరసయ్య, వర్కోలు మల్లయ్య, బూర శ్రీనివాస్, ఆంజనేయులు, శ్రీనివాస్, మహేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతు



రుద్రంగి: మండలకేంద్రంలోని ఎల్లంపల్లి కాలువపై నిర్మించిన కల్వర్టుపై సిమెంట్ కట్టలు తొలగించకపోవడం, కల్వర్టుకు ఇరువైపులా మట్టి ఎక్కువ ఎత్తులో పోయడంతో ప్రమాదకరంగా మారడంతో 'ప్రయాణం.. ప్రమాదకరం' అనే శీర్షికన శనివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. దీంతో రామకిష్టాపూర్‌పల్లె కాలనీ ప్రజలు, దుర్గమ్మ ఆలయానికి వెళ్లే భక్తులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

తాగి నడిపితే తప్పదు మూల్యం

- డ్రంకెన్ డ్రైవ్‌పై పోలీసుల నజర్
- నిత్యం బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు
- జరిమానాలు, జైలుశిక్షలు



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

వీర్నపల్లి: మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారా..! అయితే మీరు పోలీసులకు చిక్కడం ఖాయం. మీ జేబు ఖాళీ అవడం పక్కా..! బ్రీత్ ఎనలైజర్‌లో ఎక్కువ మోతాదు మద్యం సేవించినట్లు తేలితే జైలు వరకు కూడా వెళ్లే అవకాశం ఉంది. ఇవన్నీ వద్దు మనకెందుకు ప్రశాంతంగా ఉందామనుకుంటున్నారా.. అయితే డ్రంకెన్ డ్రైవ్‌కు బై..బై చెప్పండి. అప్పుడే సురక్షితంగా గమ్యం చేరుకుంటారు.. పోలీసులు విధించే జరిమానాల నుంచి తప్పించుకుంటారు. వీర్నపల్లి మండల పోలీసులు ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేశారు. మద్యం తాగి వాహనం నడిపితే కేసు నమోదు చేస్తున్నారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వరుసగా మూడుసార్లు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారి లైసెన్స్ రద్దుకు సిఫారసు చేస్తున్నారు. గత రెండు నెలల్లో మండలంలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 65 కేసులు నమోదు చేశారు.

మార్పు తెచ్చేందుకు..

మద్యం తాగి వాహనాలు నడుపుతూ తొలిసారి దొరికిన వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. రెండోసారి దొరికితే చర్యలు కఠినంగా ఉంటాయని చెబుతున్నారు. అంతేకాకుండా మద్యం తాగి వాహనాలు నడిపితే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతోపాటు భవిష్యత్‌లో డ్రంకెన్ డ్రైవ్ చేయబోమంటూ ప్రతిజ్ఞ చేయిస్తున్నారు. అయినా మందుబాబుల్లో మార్పు రావడం లేదు. నిత్యం తాగి నడుపుతూ పట్టుబడుతున్నారు.

తాగి నడిపితే కేసులు తప్పవు



మద్యంతాగి వాహనాలు నడిపితే నడిపితే కేసులు తప్పవు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగితే బీమా కూడా వర్తించదు. ఆస్పత్రుల్లో బిల్లులు చెల్లించేందుకు ఇబ్బంది పడతారు. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేస్తున్నాం. తనిఖీల్లో పట్టుబడితే ఎంతటి వారైనా ఉపేక్షించం. కేసులు నమోదు చేస్తాం. మార్పులేని వ్యక్తులను జైలుకు పంపించేలా కఠినంగా వ్యవహరిస్తాం.

– వేముల లక్ష్మణ్, ఎస్సై, వీర్నపల్లి

విద్యుదాఘాతంతో గేదె మృతి

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో విద్యుదాఘాతంతో ఓ గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన బుర్ర రవీందర్ తన గేదెను మేతకోసం సింగిల్ విండో కార్యాలయ సమీపంలో కట్టేశాడు. మేత మేస్తుండగా కిందికి ఉన్న విద్యుత్ తీగలు తగిలి మృత్యువాతపడింది. మృతిచెందిన గేదె విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత

ఇల్లంతకుంట: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. మండలంలోని తిప్పాపూర్ గ్రామ పంచాయతీ శివారులో శనివారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశామన్నారు. వాహన యజమానిని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.



కోనరావుపేట: మండలంలోని సుద్దాల–రామన్నపేట గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన కురిసిన వర్షాలకు రోడ్డంతా బురదమయంగా తయారైంది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి తారురోడ్డుగా మార్చాలని పలువురు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

బీజేపీ నాయకుల నిరసన



సిరిసిల్ల టౌన్: ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



వేములవాడ అర్బన్ : ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



తంగళ్లపల్లిలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



కోనరావుపేటలో నిరసన తెలుపుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: వేములవాడ రాజన్న ఆలయంలో దర్శనాలను నిలిపివేయడాన్ని నిరసిస్తూ జిల్లాకేంద్రంలో బీజేపీ నాయకులు నిరసనలు తెలిపారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆలయ అభివృద్ధి పేరుతో దర్శనాలను నిలిపివేయడం సరికాదన్నారు. జిల్లా బీజేవైఎం మాజీ అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీ ఊరగొండ రాజు, పల్లికొండ నర్సయ్య, మోర శ్రీహరి, మేర్గు శ్రీనివాస్, రచ్చ రాహుల్, సిద్ధి దేవరాజు, కనకయ్య, శ్రీనివాస్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: వేములవాడలో రాజన్న దర్శనాలను యథావిధిగా కొనసాగించాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఎదునూరి గోపికృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మండలకేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ వేములవాడలో ఆలయాన్ని పునర్‌నిర్మాణం చేయడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. కోడె మొక్కులు ఎలా చెల్లిస్తారో ప్రభుత్వం చెప్పాలన్నారు. బీజేపీ నాయకులు చిట్నేని శ్రీనివాస్‌రావు, పద్మ, కోల కృష్ణ, కార్తీక్‌రెడ్డి, మహేశ్, హరీశ్, కనుకయ్య, విజయ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ నందికమాన్ వద్ద అర్బన్ మండల బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ , నాయకులు శంకర్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: భక్తులకు రాజన్న దర్శనాలను నిలిపివేయడాన్ని నిరసిస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని ప్రధాన రహదారిపై సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ మండల నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలకేంద్రంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మిర్యాల్ కార్ బాలాజీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడు గొట్టె రామచంద్రం, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బైరగోని సురేశ్ గౌడ్, నాయకులు చింతల పరుశురాం, వెంకటి, వేల్పుల తిరుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంభీరావుపేట: వేములవాడ ఆలయాన్ని తెరిచి ఉంచాలని డిమాండ్ చేస్తూ గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రాల్లో బీజేపీ నాయకులు ఆదివారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేసి దిష్టిబొమ్మలు దహనం చేశారు.

చందుర్తి: మండలకేంద్రంలో బీజేపీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మోకిలే విజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు అల్లాడి రమేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పోంచెట్టి రాకేశ్, నాయకులు పెరుక గంగరాజు, చింతకుంట గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు నిరసన తెలిపారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కర్ణవత్తుల వేణు, ప్రధాన కార్యదర్శి మల్యాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గండి శ్రీనివాస్, మాజీ ప్రెసిడెంట్ అల్లూరి అశోక్ రెడ్డి, నాయకులు నేవూరి కిషన్, తదితరులు ఉన్నారు.

కార్మిక సమస్యలపై ఏఐటీయూసీ పోరాటం



సిరిసిల్లటౌన్: అన్ని రంగాల కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిత్యం పోరాటాలు చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఈనెల 26న జరిగే ఏఐటీయూసీ 4వ జిల్లా మహాసభ కరపత్రం ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, అనసూర్య, గాజుల రాధ, చేరాల రవి, అంగూరి రంజిత్, అనవేణి భూదన్న పాల్గొన్నారు.

గోదాం పనులు ప్రారంభం

కోనరావుపేట: మండలంలోని నాగారంలో పాల కేంద్రం సమీపంలో గోదాం ఏర్పాటుకు ఆదివారం పనులను పాల ఉత్పత్తిదారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం దాణా బస్తాల నిల్వ కోసం నూతన గోదాంను కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాగారం డెయిరీ చైర్మన్ బుర్రవేణి ఎల్లం, డైరెక్టర్లు, నాయకులు ప్రజాప్రతినిధులు డెయిరీ అధికారులు, పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బీడీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సూరం పద్మ

వీర్నపల్లి: మండలకేంద్రంలో ఆదివారం బీడీ–సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ సంఘం) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి సూరం పద్మ మాట్లాడుతూ.... బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు.కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.4వేల పింఛన్ అందించాలన్నారు. ఇళ్లులేని లేనివారికి వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షురాలు లాస్య, మండల కార్యదర్శి సులోచన, నాయకులు లక్ష్మి, సుజాత రేణుక, పద్మ తదితరులు పాల్గొన్నారు.